క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వెంకటేశ్వర కాలనీ, ఎన్జీవోస్ కాలనీ-2, సంఘమిత్ర కాలనీ, లక్ష్మినగర్, ఎన్జీవోస్ కాలనీ వాటర్ ట్యాంక్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు మమ్మా 60వ మహాస్మృతి దివస్

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్‌కాలనీ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బ్రహ్మకుమారీస్ సంస్థకు తొలి ముఖ్య నిర్వాహకురాలిగా సేవ చేసిన మాతేశ్వరీ జగదంబా సరస్వతి జీ (మమ్మా) 60వ మహాస్మృతి దివస్‌ను మంగళవారం నిర్వహించనున్నట్లు కాజీపేట నిర్వాహకురాలు శ్రీదేవి తెలిపారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



రామన్నపేట: విద్యతోనే విద్యార్థులు అభివృద్ధి చెందుతారని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యురాలు, వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి అన్నారు. వరంగల్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల ఆశ్రమ పాఠశాలను సోమవారం సందర్శించి పిల్లల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. పిల్లల అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మణికంఠ, టీచర్లు, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



హన్మకొండ: విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ బాలాజీ చికిత్సకు తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్థిక సాయాన్ని అందించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏనుగల్లు సెక్షన్‌లో అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్‌గా పనిచేస్తున్న అసావద్ బాలాజీ.. ఈనెల 19న విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. దాంతో అతడి రెండు కాళ్లను తొలగించారు. హనుమకొండ రాంనగర్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబానికి రూ.5 వేల సాయాన్ని అందించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ పరిధిలోని వసంతాపురం, దూపకుంట, గాడిపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సింగారం రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా ఉంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదాసి శ్రీధర్, వెంకటేశ్వర్లు, కార్తీక్, గణేష్, శివ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



హన్మకొండ: మాజీ ప్రధాని, భారత రత్న పీవీ.నరసింహారావు విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రముఖ సామాజిక వేత్త పిడిశెట్టి రాజు కోరారు. ఈ మేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, దేశానికి అత్యుత్తమ సేవలు అందించిన అపర చాణక్యుడు పీవీ అని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రధానిగా కొనసాగి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని గుర్తుచేశారు. అనేక ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. అలాంటి గొప్ప పాలనాదక్షుడి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

స్టాఫ్ రిపోర్టర్ హఠాన్మరణం



దత్తు రెడ్డి(ఫైల్)

హన్మకొండ అర్బన్: ఈనాడు దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న దత్తు రెడ్డి(36) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన దత్తు రెడ్డి.. నల్లగొండలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై హనుమకొండకు వచ్చారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. దత్తు రెడ్డి మృతిపై జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు సంతాపం తెలిపారు.

రోడ్డు.. గుంతలమయం

- అధ్వానంగా కడిపికొండ – రాంపేట క్రాస్ రోడ్డు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో ఖమ్మం బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న రేణుకాఎల్లమ్మ దేవాలయం నుంచి కడిపికొండలోని బొడ్రాయికి వెళ్లే దారి అధ్వానంగా ఉంది. కడిపికొండ నుంచి రాంపేట, అయోధ్యపురం క్రాస్ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నెహ్రూ విగ్రహం నుంచి బొడ్రాయి వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. కడిపికొండలోని రాంపేట, అయోధ్యపురం,





కడిపికొండలో కంకరతేలిన రోడ్డు

బొడ్రాయి వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. మూలమలుపుల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇరుకైన రోడ్డులో ఎదురెదురుగా వాహనాలు ఎదురుపడి రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు నిర్మించాలని ఫిర్యాదు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుంతలమయమైన క్రాస్‌రోడ్డు

వ్యవసాయ ప్రణాళికపై చిత్తశుద్ధి కరువు

- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్

వరంగల్ చౌరస్తా: వ్యవసాయ ప్రణాళికపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాలను సకాలంలో అందజేయాలని ఎంసీపీఐ (యూ) కేంద్ర కమిటీ సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి, ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సీజన్‌లో కోటిన్నర ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగిన విధంగా విత్తనాలు, ఎరువులను సమకూర్చడంలో ప్రభుత్వం విఫలం చెందడంతో, నాణ్యతలేని నకిలీ విత్తనాలు మార్కెట్లో చలామణి అవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల ఎకరాల్లో నాణ్యతలేని విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. విత్తన కంపెనీలపై ప్రభుత్వ కనీస పర్యవేక్షణ లేదన్నారు. భూములను పరిశీలించి భూసార పరీక్షలు చేయకపోవడం అన్యాయం అని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు 5 లక్షల పరిహారం అందజేయడం లేదని వాపోయారు. రైతాంగం సమస్యలపై జూలై 7న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, కోశాధికారి గుండెబోయిన చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

27న అప్రెంటిస్‌షిప్ జాబ్‌మేళా



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అధ్యాపకులు

విద్యారణ్యపురి: స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ తెలంగాణ ప్రభుత్వం, ఆర్‌డీఎస్‌డీ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27న హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న అప్రెంటిస్ షిప్ జాబ్ మేళా – 2025 వాల్‌పోస్టర్లను అధ్యాపకులతో కలిసి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 – 2025వ విద్యా సంవత్సరంలో వృత్తివిద్య కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ జాబ్‌మేళా చక్కని వేదిక అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుమతిరెడ్డి కళాశాలలో ఒలింపిక్ దినోత్సవం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల క్రీడా కమిటీ ఆధ్వర్యంలో ఒలింపిక్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒలింపిక్ క్రీడల చారిత్రక నేపథ్యం, వాటి ప్రాముఖ్యత గురించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి వివరించారు. ఒలింపిక్ క్రీడలు కేవలం ఆటల పోటీలు మాత్రమే కావని, విద్యార్థినుల ఆత్మస్థైర్యం, పట్టుదల, కృషి, స్ఫూర్తికి ప్రతీకలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ మహేందర్, క్రీడా కమిటీ సభ్యులు రవికిరణ్, మాధవి, వంశీప్రియ, ఏఓ వేణుగోపాల స్వామి, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంతో జీవితం నాశనం

- కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి

హసన్‌పర్తి: డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. హసన్‌పర్తిలోని జూనియర్ కళాశాల, పాఠశాలల విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌తో పట్టుపడితే జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సైలు రవి, సిద్ధయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం

ఖిలా వరంగల్: సమాజంలో పేదల ఐక్యతకు వ్యతిరేకంగా కులవ్యవస్థ తీవ్ర రూపం దాల్చిందని, ఈ క్రమంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుదామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. వరంగల్ ఉర్సుగుట్ట ఆర్ఎస్ భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిచ్చెన మెట్ల వ్యవస్థ ద్వారా కింది కులాలను పైకులాలు అత్యంత హీనంగా చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కులవ్యవస్థ.. సమాజ అభివృద్ధికి ఆటంకంగా మారిందని అన్నారు. మనుషులను మనుషులుగా చూడలేని పరిస్థితులు దాపురించాయని వాపోయారు. దళితులు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడాలని, ఆత్మగౌరవంతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఉసిల్ల కుమార్, సంజీవ, ఇమ్మడి శ్రీనివాస్, ఎలిషా, రామకృష్ణ, మాదాసి దివ్య, సింగారపు బాబు, ప్రకాశ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



డీఎంహెచ్ఓ అప్పయ్యకు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్

హన్మకొండ అర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ కేంద్రను డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును ఆరోగ్య శాఖ సిబ్బంది (సీఐటీయూ)తో కలిసి హనుమకొండ డీఎంహెచ్ఓ అప్పయ్యకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లాలో షాపింగ్ మాల్స్, హోటళ్లు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని వాపోయారు. ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వడం లేదని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. జిల్లా లేబర్ అధికారులు కనీస వేతనాలు అమలు చేయించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సహాయ కార్యదర్శి పుల్లా అశోక్ సీఐటీయూ నాయకులు జే.శ్వేత, లీల వి.రమాదేవి, పి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య

హన్మకొండ అర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య కోరారు. జూలై 9న జరగనున్న అఖిల భారత సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హనుమకొండ సౌత్ మండల సీఐటీయూ కమిటీ సమావేశం 49వ డివిజన్ ప్రగతినగర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ కార్మిక వర్గం అనేక సంవత్సరాలు పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం ఒక్క కలం పోటుతో రద్దుచేసి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని అన్నారు. అనంతరం సార్వత్రిక సమ్మెకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్, హనుమకొండ సౌత్ మండల సీఐటీయూ కార్యదర్శి ఆలకుంట యాకయ్య, శ్రీను, ఆటో యూనియన్ నాయకులు ఆలకుంట మల్లయ్య, సప్పిడి మనోహర్, దాసరి సమ్మయ్య, గోల్కొండ ఏసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు విడుదల చేయాలి

న్యూశాయంపేట: బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రైవేట్ పాఠశాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత విద్యను ప్రభుత్వం అందిస్తోందని ఏబీఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్ పీడీఎస్‌యూ, స్వేరోస్ నాయకులు అన్నారు. మూడేళ్లుగా ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని ఆరోపించారు. ఈమేరకు వరంగల్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. నిధులు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ యజమాన్యాలు విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించడం లేదని అన్నారు. అనంతరం ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బి.నరేష్, శరత్, పార్థసారథి, అజయ్, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వ అనుమతులను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నాయని, వాటిని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వరంగల్ కలెక్టర్ సత్యశారదకు సోమవారం వినతిపత్రం అందించారు.

సౌందర్య లహరి పారాయణం



పారాయణం చేస్తున్న మహిళలు

హన్మకొండ కల్చరల్: మాస శివరాత్రిని పురస్కరించుకుని హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలోని ముక్తేశ్వరాలయంలో సోమవారం సౌందర్య లహరి, శివానంద లహరి పారాయణం నిర్వహించారు. దేవాలయంలో హనుమకొండ కిషన్‌పురకు చెందిన సౌందర్య లహరి భక్త బృందంలోని 50మంది మహిళలు పాల్గొని సౌందర్య లహరి పారాయణం చేశారు. కార్యక్రమంలో టీటీడీ కల్యాణ మండపం ఇన్‌చార్జ్ రఘువీర్, టీటీడీ డీపీపీ జిల్లా బాధ్యులు రామిరెడ్డి కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు బొల్లు అమర్‌నాథ్ శాస్త్రి, అల్లంకి శ్యాంకుమార్, భక్త బృందం నిర్వాహకురాలు కె.శోభారాణి పాల్గొన్నారు.

విద్య, వైద్యంలో రాజ్యమేలుతున్న అవినీతి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నయీంనగర్: విద్య, వైద్యంలో జరుగుతున్న అవినీతిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని ప్రజావిధి అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షుడు పుల్లూరి కుమారస్వామి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతిని అరికట్టాల్సిన ఉన్నతాధికారులు.. నిరంకుశ రాజకీయ నాయకుల, దళారీల కనుసన్నల్లో పనిచేయడంతో విద్య, వైద్యంలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా విద్య, వైద్య రంగాలు కార్పొరేట్ శక్తులకు లాభార్జన వ్యాపారంగా మారాయని తెలిపారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు చికిత్సలు చేసినట్లు మోసం చేస్తూ ప్రభుత్వ నిధులను దోచుకుంటున్నాయని చెప్పారు. ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల యజమాన్యాలు ఇష్టారీతిన లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. సమావేశంలో శ్రీనివాస్, జీకే.రవి, సుద్దాల అనిల్‌కుమార్, బాబురావు, ఆనందం, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇప్పటికీ వితంతువులపై వివక్షే



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుజాత

- బాలవికాస సాంఘిక సేవా సంస్థ అసిస్టెంట్ మేనేజర్ సుజాత

హసన్‌పర్తి: గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ వితంతువుల పట్ల వివక్ష కొనసాగుతోందని బాలవికాస సాంఘిక సేవా సంస్థ అసిస్టెంట్ మేనేజర్ సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. బాలవికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలో వితంతువుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సుజాత మాట్లాడుతూ వితంతువులను ఇప్పటికీ శుభకార్యాలకు దూరంగా ఉంచుతున్నారని అన్నారు. ఈ క్రమంలో వితంతువులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం వితంతువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహలత, బాలవికాస సంస్థ మండల కో ఆర్డినేటర్లు రమ, అల్వాల శోభ, పుల్లా పద్మ, మహేందర్, రూప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆర్టీసీ బీసీ ఉద్యోగులకు అండగా ఉంటా

హన్మకొండ: ఆర్టీసీ బీసీ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ గౌరవాధ్యక్షుడు ఈవీ.శ్రీనివాస్ రావు అన్నారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని స్వగృహంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈనెల 24న హైదరాబాద్‌లో జరగనున్న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ అధ్యక్షుడు గొలనుకొండ వేణు, కార్యదర్శి మాదారపు సాంబయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు శ్రీనివాస్, హనుమకొండ డిపో చీఫ్ అడ్వైజర్ బీఎస్.చారి, సెక్రటరీ విమలాకర్, వరంగల్ –1 డిపో అధ్యక్షుడు దుంపేటి యాదగిరి, సెక్రటరీ పోతరాజు రమేష్ పాల్గొన్నారు.

యంగ్ ఇండియా స్కూల్‌కు కేయూ భూములు కేటాయించొద్దు

కేయూ క్యాంపస్: యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి కాకతీయ యూనివర్సిటీ భూమిని కేటాయిస్తూ ఇటీవల పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ బీఆర్ఎస్‌వీ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్, కోకన్వీనర్ శివ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జయసూర్య, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేష్, బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివ, ఏఐడీఎస్ఓ అధ్యక్షుడు మధు మాట్లాడుతూ 15 ఎకరాల కేయూ భూమిని యంగ్ ఇండియా స్కూల్‌కు కేటాయిస్తే, భవిష్యత్‌లో యూనివర్సిటీ అవసరాలకు కొత్త భవనాల నిర్మాణాలకు స్థలం కొరత ఏర్పడుతుందని పేర్కొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో అవినీతిపై విచారణ చేపట్టాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలోని కాజీపేట మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కులో జరిగిన అవినీతిపై విచారణ జరిపి న్యాయం చేయాలని టెక్స్‌టైల్ పార్కు సభ్యులు కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 16 ఏళ్ల కాలంలో సొసైటీ ఆదాయ వ్యయాల గురించి సభ్యులకు వివరించలేదని అన్నారు. రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన పాత మేనేజ్‌మెంట్ కమిటీ నుంచి రికవరీ చేస్తానని హామీ ఇచ్చిన కొత్త మేనేజ్‌మెంట్ కమిటీ విస్మరించిందని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి టెక్స్‌టైల్ పార్కులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సభ్యులు లక్ష్మీనారాయణ, కైరంకొండ రవి, శంకర్‌రావు, యాదగిరి, దిలీప్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలని వినతి

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ – రాంపూర్ మధ్య ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని అడ్‌హక్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌తో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గాలి, నీరు, నేల కలుషితం అవుతున్నట్లు తెలిపారు. వృద్ధులు, పిల్లలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే మురుగునీరు నేరుగా మడికొండ పెద్ద చెరువులోకి వెళ్తోందని అన్నారు. కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు మద్దెల ఎర్రగట్టు స్వామి, పానగోటి వెంకట్‌రావు, తాటిరెడ్డి కరుణాకర్ రెడ్డి, బొల్లికొండ వినోద్, లావణ్య పాల్గొన్నారు.

ఎంఎస్ఆర్‌నగర్‌ను అభివృద్ధి చేయాలి

మడికొండ: ఎంఎస్ఆర్‌నగర్ కాలనీని అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు సంటి రవి అధ్యక్షతన మడికొండలోని ఎంఎస్ఆర్‌కాలనీలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడుతూ 20ఏళ్లుగా 300 కుటుంబాలు మెట్టుగుట్ట ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నాయని అన్నారు. అక్కడి పేదలు ఇంటి పన్ను, కరెంట్ బిల్లులు కడుతున్నా అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించడం లేదని వాపోయారు. కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించి, సైడు కాలువలు ఏర్పాటు చేయాలని సూచించారు. గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, నాయకులు కలింగపట్నం దశరథరావు, కస్తూరి రాజు, అక్కిలి కట్టయ్య, ప్రసాద్, కోమల, చంద్రయ్య, రవి, పాల్‌రాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయాలి

విద్యారణ్యపురి: కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ ప్రాంతంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి బీరెడ్డి జస్వంత్ కోరారు. ఈ మేరకు మహాసభల వాల్‌పోస్టర్లను యూనివర్సిటీలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్నాయని విమర్శించారు. విద్యావ్యవస్థలోని సమస్యలపై మహాసభల్లో చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, అన్వేష్, ఓంప్రకాశ్, మహేందర్ పాల్గొన్నారు.

అంజన్న ఆలయంలో వరుణ హోమం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులు సోమవారం వరుణ హోమం నిర్వహించారు. వరుణుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ భక్తులు వరుణ హోమం చేశారు. దేవాలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అంజన్నకు నవరసాలతో అభిషేకాలు జరిపించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వాసవి క్లబ్, వనిత క్లబ్‌ల సభ్యులు పూజలో పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మడికొండ: అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందజేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాంపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు ఏర్పుల భిక్షపతి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు 46వ డివిజన్ రాంపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉపాధ్యక్షుడు ఆరెపల్లి పవన్, ప్రధాన కార్యదర్శి సీసల ప్రదీప్, నాయకుడు మునిగాల ప్రభాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



హసన్‌పర్తి: జన సంఘ్ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని హసన్‌పర్తి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారెపల్లి రాంచంద్రారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్ రావు, నాయకులు గుర్రాల చంద్రమౌళి, దాసరి రాజు, పెద్దమ్మ నాగరాజు, సురేష్, రవీందర్, రాజు, మధుసూదన్, సుమన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.